# పాడుపెళ్ళం



**తన** భార్యని పాడు పెళ్లంగా పేర్కొనడంతో శ్లేష ధ్వనిస్తోందని తెలిసినా, రాజా తన పద్ధతి మానడు. పాటలు పాడే పెళ్లాలంటే అతని కంత చికాకు. పెళ్లాలనే కాదు. ఎవరు పాడినా అతనికి ఇష్టం ఉండదు. అతని ఫ్రెండ్సందరూ రేడియో సిలోన్ వినే రోజుల్లో, అతను బి.బి.సి అందుకోడానికి ప్రయత్నించేవాడు. పాటలుండవు కదాని ఇంగ్లీషు సినిమాలు చూసేవాడు. దేశవాళీ సినిమాల కెళితే పాటలొచ్చినప్పుడు వినేవాడు కాదు. తెరమీద ఆడవాళ్ల వొంపుసొంపులు పరీక్షిస్తూ కూచునేవాడు. నేపథ్యగీతాలయితే నల్లులను వేటాడ్డమో, సైకిలు స్టాండు టోకెన్ ఉందో లేదో వెతుక్కోడమో చేసేవాడు.

అతను సావిత్రిని చూడడానికి వెళ్లే టైముకే - పెళ్లిచూపుల్లో అమ్మాయి చేత పాట పాడించే సంప్రదాయం పోయింది. అందుకనే, రాజా తలిదండ్రులు సావిత్రిని పాడమనలేదు. అయినా సావిత్రే పాడేసింది. సినిమా హాల్లో చేసినట్టుగానే పాడేవాళ్లను నఖశిఖపర్యంతం తేరిపార చూడడం వల్ల సావిత్రి నచ్చింది రాజాకు. ముఖం చూడగానే వద్దనుకొన్నా, పాట ధర్మమాని ఆమె అవయవ సౌష్ఠవం అతని దృష్టినాకర్షించి పెళ్లి జరిగేట్లా చేసింది.

" నీ పాట వల్లనే మన పెళ్లి జరిగింది" అన్నాడు రాజా తాంబూలాలు పుచ్చుకొనేటప్పుడు. స్ట్రేటజిక్ రీజన్స్ వల్ల వివరాలు చెప్పకపోవడంతో సావిత్రి పొరబడింది. శోభనం నాడు కిటికీ తలుపు తీసి చంద్రుడి మీద పాట పాడతానని పట్టుబట్టింది. అప్పుడిక పాటల గురించి తన అభిప్రాయం చెప్పక తప్పలేదు రాజాకు.

అయినా సావిత్రి తన పంథా మార్చుకోలేదు. అవకాశం, దానంతట అది రాకపోయినా దొరక బుచ్చుకొని పాటలు పాడదామని చూసేది. పదిమంది పోగిడితే చాలు, గొంతు సవరించుకొనేది. ఫ్రెండ్సంతా ఫామిలీస్‌తో పిక్నిక్కెళితే అంత్యాక్షరి ఆడదామనేది. పల్లవి పాడితే చాలన్నా వినకుండా పూర్తి పాట పాడేది. రాజా మొహం చూసి అందరూ అప్పటికి ఊరుకొనేవారు కానీ తర్వాత సారి నుంచి కారమ్స్, పేకాట లాటివి ఆడదామనేవారు. అప్పుడు సావిత్రే మిగతావాళ్లను పాడమని ప్రోత్సహించి, వాళ్లొక పాట పాడేక, వాళ్లు తిరిగి మొహమాటానికి తనను పాడమంటే రెండు మూడు పాడేసి గుక్క తిప్పుకొనేది.

పక్క వాళ్లంతా ఆమె గురించి జోకులు వేస్తున్నా రాజా సహించేడు. 'మనిషి, మనిషికీ ఓ వీక్నెస్ పాపం' అనుకొని సరిపెట్టుకున్నాడు. కానీ ఓ సారి ఓ సుబ్బరామయ్య గారు తన భార్య గురించి అడిగిన తీరుకి మాత్రం మండిపడ్డాడు.

ఆయన తన ఫ్రెండు చుట్టం. పరిచయమైనప్పుడు వివరాలు అడిగి " మీ మావగారూ, మేమూ పక్క పక్క ఇళ్లలో ఉన్నామయ్యా, కొంతకాలం" అన్నాడు. "ఇంతకీ నువు ఏ అమ్మాయి మొగుడివి?" అని అడిగాడు.

" మూడో అమ్మాయండీ"

" అలా గుర్తులేదు. అందరూ ఒకే ఈడు పిల్లలా ఉండేవాళ్లు, ఒకమ్మాయి ఎప్పుడూ బుంగమూతి పెట్టుకుని ఉండేది. ఇంకో అమ్మాయి 'ముచ్చెమంతా పసుపు ముఖమంత చాయ' అని అస్తమానూ చెవి కోసిన మేకలా పాడుతుండేది. ఈ అమ్మాయికి సంప్రదాయం మీద ఎంత భక్తో.... పెద్దయ్యాక ఇంటి ముందు ' ముచ్చాల' ముగ్గులేస్తుందేమో చూడాలి అనుకునే వాణ్ని... "

" ఆ పాటలు పాడే అమ్మాయే మా అవిడండి!" అని రాజా ఆయన్ని ఆపబోయేడు. కానీ ఆయన ఆగలేదు.

"..... అలాగా, అయితే ముగ్గులేస్తోందా?" అని గట్టిగా నవ్వుతూ అడిగాడు.

రాజా ఏమనాలో తెలీక వేదాంతం రంగరించి "భలేవారండి, ఆ పాట రాసిన ఆరుద్ర గారింట్లోనే వేస్తారో, లేదో" అన్నాడు.

"అదీ నిజమేలే, ముగ్గులు వేయకపోతే అదే పాయె, పోనీ పెద్దయ్యాకైనా పాటలు మానేసిందా?" అన్నాడు జాలిగా.

ఆ సాయంత్రం రాజా పోట్లాట వేసుకొన్నాడు. - "నీ వల్ల నా పరువు పోతోంది." అంటూ. 'ఆయన మాటలకు అంత రుంజుకోడం ఎందుకు? ఆయన ఎంత లంచగొండో

తెలుసా?" అంది సావిత్రి.

"లంచగొండో, మంచగొండో నాకనవసరం. నువ్వు పిచ్చిపాటలు పాడే రకం అని ఆయన మనసులో ముద్ర పడిపోవడమే నాకు బాధాకరంగా ఉంది. చిన్నప్పుడు సరే, పెద్దయ్యాక కూడా నీ పద్ధతి మార్చవా?"

"బావుందండోయ్, ఇప్పుడు ఇంట్లో ఎక్కడ పాడుతున్నాను? ఎదైనా పెళ్లిళ్ల ఫంక్షన్లయితేనే పాడుతున్నాను. ఇదివరకు రోజుల్లో పెళ్లి భోజనాల దగ్గిర ఎన్నో పాటలు పాడేవారట. మన దురదృష్టం కొద్దీ బఫేలొచ్చి సంప్రదాయాలన్నీ మట్టి గొట్టుకుపోయాయి."

"ఏం పోవడమో, మంగళహారతులివ్వడమూ పోలేదు. ఆ టైములో నువ్వు పాట పాడడమూ పోలేదు."

" అదేవిటి? వాళ్లేగా పాడమంటారు...."

"అంటారు, కానీ నువ్వు పాడకూడదు పాట రాదనాలి "

"వచ్చి కూడా అలాగనడం.... "

" ...... ఏమీ తప్పులేదు, పాపం కాదు. మంగళహారతి దగ్గిర ఆడపడుచు కట్నాలు ఎంత వేయాలనడం మీద డిస్కషన్లు, వేళాకోళాలూ జరుగుతూ ఉంటే నీ పాట ఎవడు వింటాడు?"

"ఫంక్షన్లలోనూ అంతే, పాట పాడమని అంత బలవంత పెట్టడం, తీరా మొదలు పెట్టిందాకా ఉండి కబుర్లాడుకోవడం. నాకు కోపం వచ్చి పాటాపి తిడదామా అనిపిస్తుంది. వీళ్లకి కల్చర్ ఎప్పుడొస్తుందో."

".... ఎప్పటికీ రాదు. వచ్చేదాకా నువ్వు పాట పాడడం వాయిదా వేసుకో. వాళ్ళు అడగడం, గొంతు బాగోలేదని నువ్వు మొహమాటపడడం. ఫర్వాలేదు పాడమని వాళ్లు జోకులేయడం, వీటితోటే వాళ్ల సరదా తీరిపోతుంది. అందువల్ల నీ పాటికి నువ్వు పాట పాడుకుంటూంటే వాళ్ల పనులు వాళ్లు చూసుకొంటారు."

"పోనీ వాళ్ళని మాట్లాడవద్దని మీరు అదలించవచ్చుగా...."

"చాల్లే తెలివి. నా మీదే జోకులేస్తారు."

"పెళ్లం గురించి ఆ మాత్రం ఓర్చుకో లేరా? ఊళ్లోవాళ్లకి ఉపకారమంటే మాత్రం తయారవుతారు" అంటూ సావిత్రి అలిగింది.అలక తీర్చక తప్పలేదు రాజాకి.

"అది కాదు సావిత్రీ, వాళ్ళందరికీ నువ్వంటే అసూయ - బాగా పాడతావని. చుప్పనాతితనంతో నీ పాట కొత్తనాళ్లెవరూ వినకుండా అలా డిస్టర్బ్ చేస్తారు." అంటూ ఓదార్చాడు. కానీ అది మరోలా కొంప ముంచింది.

"పోనీ ఈ బంధువుల సర్కిల్లో వద్దుగానీ, మీ ఫ్యాక్టరీ ఫంక్షన్లో పాడించండి. ఏటేటా యానివర్సిరీ అవుతుందిగా. క్రితంసారి కల్చరల్ సెక్రటరీ గారి భార్య ప్రార్థనగీతం పాడిందిగా. ఈ సారి నేను పాడతాను."

రాజా లాజిక్ ప్రయోగించబోయేడు - "కానీ నువ్వు కల్చరల్ సెక్రటరీ భార్యవు కావుగా. అందువల్ల ఛాన్సురాదు." అని.

"అయితే మీరే సెక్రటరీ అవ్వండి. అప్పుడు నేను పాడవచ్చు" అని మెండికేసింది సావిత్రి. రాజా ఎంతో నచ్చచెప్పబోయేడు - సెక్రటరీ అయితే బోల్డు కష్టం. రాత్రనక, పగలనక, ఇల్లనక, వాకలనక తిరగాలి. డ్రామా రిహార్సల్సు ఇంట్లో జరిపించాలి. కాఫీలు, టీలు

తయారు చేసి ఇవ్వాలి. లేడీ ఆర్టిస్టులను రాత్రి ఇంటి దగ్గిర దింపి రావాలి. వాళ్ల ఇకయిఏకలూ, పకపకలూ భరించాలి. చచ్చేటంత శ్రమ, ఖర్చు..."

సావిత్రి వాటన్నింటికీ సిద్ధపడింది. రాజాకు తప్పలేదు. కానీ ప్రార్థన గీతం ఈ సారి స్టాఫే పాడాలని అన్నారు జి.ఎమ్.గారు. సావిత్రి కొరకొర చూపులకు తట్టుకోలేక, ప్రోగ్రాం మధ్యలో - నాటకం సీన్లు మార్చేటప్పుడు ఒక లలితగీతం తను పాడే ఏర్పాటు చేశాడు రాజా. సావిత్రి దానికే సంబరపడింది. రిహార్సల్స్‌తో పెంకులెగర గొట్టింది.

ప్రోగ్రాం ప్రారంభమవడానికి ఒక గంట ఉందనగా, హఠాత్తుగా గుర్తుకొచ్చింది రాజాకు. క్రితంసారి రెండు యూనియన్ల తాలూకు ప్రేక్షకుల మధ్య గొడవలు జరిగి ప్రోగ్రాం మధ్యలోనే ఆగిపోయింది. ఈ సారీ అలాగే జరిగి సావిత్రి పాట పూర్తి కాకుండానే మధ్యలో ఆగిపోతే?... సావిత్రి తననునరికి పోగులు పెట్టడం ఖాయం.

ఓ పదిహేను నిమిషాల తర్వాత చూస్తే రాజా యూనియన్ల లీడర్ల చేతులూ, కాళ్ళూ పట్టుకొంటున్నాడు. వాళ్లంతా కరిగేరు. అవతలివాళ్లు ఎంత రెచ్చగొట్టినా తాము మాత్రం ఓర్పు వహిస్తామని, ప్రోగ్రాం కనీసం రెండుగంటలపాటు (ఆ పాటికి సావిత్రి పాట అయిపోతుంది) నడిచేట్లా చూస్తామని హామీ ఇచ్చారు. పాపం, అన్నమాట నిలబెట్టారు. సావిత్రి విజయవంతంగా స్టేజి ఎక్కింది. పల్లవి ఇంకా ఎత్తుకుందో లేదో, ఫ్యాక్టరీ పీఆర్వో గారు అదావుడిగా స్టేజి ఎక్కి అవతలి వైపు మైకు అందుకొన్నాడు.

"ఫ్రెండ్స్, ఇపుడే ఒక ఫోన్ కాల్ వచ్చింది. ఫ్యాక్టరీలో ఎక్కడో బాంబు పెట్టారట. నేనప్పుడే పోలీసులకు ఫోన్ చేసేశాను. ఒకటి రెండు నిమిషాల్లో వాళ్లు వచ్చేస్తారు కూడా. అన్నీ వెతుకుతారు. బాంబు ఉండకపోవచ్చు. ఇది ఉత్తుత్తి ఫోన్ కాల్ కావచ్చు. ఒకవేళ బాంబు ఉంటే మాత్రం అవతల పారేస్తారు. మీరేం కంగారు పడకండి," అంటూ కంగారు, కంగారుగా స్టేజి దిగేశాడు.

ఆయనెప్పుడూ యింతే. సమయం సందర్భం తెలియదు. ఏదైనా ఉంటే పరిగెట్టుకు వచ్చి అందరికీ చెప్పేస్తాడు. మనస్సులో ఏదీ దాచుకోలేడు. బాంబు మాట విన్నాక జనాలు ఊరుకుంటారా? కకావికలై పరిగెట్టడం మెదలు పెట్టారు. కానీ చెక్కు చెదరకుండా ఉన్నచోట నుండి కదలకుండా నిలిచిన వ్యక్తి సావిత్రి ఒక్కత్తే!

తనకొచ్చిన ఈ అవకాశం ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదలచు కోలేదామె. 'చెదిరే ముంగురులు' పాట పక్కన బెట్టి, 'అదరకురా, బెదరకురా, మనసు చెదరనీయకురా' అన్న పాట అందుకొని వీరావేశంతో పాడడం మొదలు పెట్టింది.

ఈ పాటల పిచ్చితో ప్రాణాలు పోగొట్టుకొంటుందేమోనని జాలి కొద్దీ, రాజా వెళ్లి ఆమె వద్దకు చేరి పక్కకు లాగబోయాడు. అతన్ని విదిలించేసుకొని ఉద్రేకంగా పాట కొనసాగించిందామె. వదిలి వెళ్లడానికి మనసు రాక రాజా అక్కడే నిలబడిపోయాడు. అతని వెనక అతని అసిస్టెంట్లు వచ్చి చేరారు. స్టేజి మీద జనం అంతా శాంతంగా నిలబడడంతో ఆడిటోరియంలో జనాలు కూడా ధైర్యం తెచ్చుకున్నారులా ఉంది. సద్దు మణిగారు. ఈ లోపుల పోలీసులు రావడం, 'బాంబూ, గింబూ ఏదీ లేదు, వట్టి హోక్స్ కాల్' అని తేల్చడం జరిగింది.

పది నిమిషాల్లో కార్యక్రమం పునః ప్రారంభమయింది. ఇంకొక అరగంట సాగింది. వందన సమర్పణకు ముందు జనరల్ మేనేజర్ గారు స్టేజి ఎక్కారు.

"ఈ రోజు కార్యక్రమంలో అనుకోకుండా అవాంతరం వచ్చింది. మన ప్రోగ్రాం అంటే కిట్టని వాళ్లెవరో చేసిన కుట్ర అది. కొద్ది నిమిషాలపాటు అందరమూ ధైర్యం కోల్పోయిన మాట నిజమే. కానీ స్టేజి మీద ఉన్న రాజా గారి మిసెస్ మాత్రం నిబ్బరంగా నిలబడి, సందర్భానికి తగినట్లు వేరే పాట పాడారు. ఆమె ధైర్యానికీ, సమయస్ఫూర్తికీ అభినందిస్తూ నా తరపున ఆమెకు ప్రత్యేక బహుమతి ఇస్తున్నాను." అని ప్రకటించారు.

సావిత్రి సంతోషంతో తలమునకలయిపోయింది. ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు జి.ఎమ్.గారు తన పాటకు ఎలా ముగ్ధులయి పోయారో చెప్పుకొని మురిసిపోతూంటే, "ఆయన నీ గాత్రమాధుర్యానికి కాదు, ధైర్యానికి బహుమతి ఇచ్చారు." అని అడ్డు చెప్పకుండా తమాయించుకున్నాడు రాజా. ఆ తర్వాత ఇంటి కొచ్చిన ప్రతీవాడికీ సావిత్రి ఆయనిచ్చిన కప్పు చూపించి తన పాట గురించి గొప్పలు చెప్పుకుంటుంటే కూడా అసలు విషయాన్ని చెప్పి 'రికార్డు' సరిదిద్దే ప్రయత్నం చెయ్యలేదు. అతనికప్పటికే పెళ్లయి మూడేళ్లయింది. యదార్థాలు చెప్పడం ఎంత డేంజరస్సో అతని కాపాటికే తెలిసివచ్చింది.

(ఈనాడు ఆదివారం జులై 1997)

